క్లుప్తంగా

రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్‌గా చోడిపిండి



రోటరీ క్లబ్ (3020) అసిస్టెంట్ గవర్నర్‌గా నియమితులైన చోడిపిండి సుబ్రహ్మణ్యం

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ (3020) అసిస్టెంట్ గవర్నర్‌గా 2023–24 సంవత్సరానికి గాను తాను నియమితులైనట్లు కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చోడిపిండి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 5వ తేదీ రాత్రి అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో తొమ్మిది జిల్లాలకు సంబంధించి రోటరీ క్లబ్ సమావేశం నిర్వహించారన్నారు. గవర్నర్ దత్త సుబ్బారావు ఈ మేరకు తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కొయ్యలగూడెం మండలంతో పాటు జంగారెడ్డిగూడెం, నిడదవోలు, ద్వారకాతిరుమల పరిధిలోని క్లబ్బులకు ఆయన అసిస్టెంట్ గవర్నర్‌గా వ్యవహరించనున్నారు.

మళ్లీ మొరాయించింది



రాజుపోతేపల్లి సమీపంలో మొరాయించిన ఆర్టీసీ బస్సు

టి.నరసాపురం : టి.నరసాపురం రూట్‌లో కండిషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సును నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఏలూరు నుంచి టి.నరసాపురం మీదుగా చింతలపూడికి ఏలూరు డిపో నుంచి జీలకర్రగూడెం, రాజుపోతేపల్లి, కె.జగ్గవరం, బందంచర్ల గ్రామాల మీదుగా బస్సు సర్వీసును నిర్వహిస్తున్నారు. ఇది సింగిల్ రూట్ కావడం, ఈ రూట్‌లో తిరిగే ఆర్టీసీ బస్సు తరచూ మొరాయిస్తుండటంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే కోవలో సోమవారం బస్సు రాజుపోతేపల్లి సమీపంలో మరమ్మతులకు గురైంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కండీషన్‌లో ఉన్న బస్సును నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : నటుడు నందమూరి బాలకృష్ణ ఒక టీవీ ఛానల్‌లో ప్రసారమైన అన్‌స్టాపబుల్ కార్యక్రమంలో నర్సులపై చేసిన అసభ్య వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని, బహిరంగంగా నర్సులకు క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాగం వేణుగోపాలాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరంతరం సేవలు చేస్తూ, కరోనా విపత్కర కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన నర్సులను కించపర్చేలా వ్యంగ్యంగా బాలకృష్ణ మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

అమ్మవార్లకు పూజలు

బుట్టాయగూడెం : కామవరం సమీపంలో కొలువై ఉన్న గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు సోమవారం రెండోరోజు ఘనంగా జరిగాయి. జాతర సందర్భంగా గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలో విశేష సర్వత్రా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కాగా మంగళవారం అమ్మవారికి పసుపు, కుంకుమ సౌభాగ్య పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

టి.నరసాపురం : రహదారి ప్రమాదాలు ఎక్కువగా ట్రాఫిక్ ఉల్లంఘనలు చేయడం వల్ల, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరుగుతున్నాయని పోలవరం డీఎస్పీ లతాకుమారి అన్నారు. బొర్రంపాలెం హైస్కూల్ విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాలు, మైనర్ బాలికల సంరక్షణ కోసం పాటించాల్సిన పద్ధతులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆయా అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, టి.నరసాపురం ఎస్సై కె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు

చింతలపూడి : క్రమశిక్షణతో కూడిన చదువు వల్ల విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆశయాలు అలవడతాయని మానవత డైరెక్టర్ జగ్గవరపు సూరారెడ్డి అన్నారు. రాఘవాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నైతిక విలువలు, వృత్తి మార్గదర్శకత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. చింతలపూడి శాఖ చైర్మన్ ఎ.అప్పారావు, అధ్యక్షుడు కేఎస్ చిన్నారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం శివరామ్, వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, ఎంవీ అప్పారావు, డి.రాజబాబు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం గం.12.30కు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన మండలంలో చేపట్టిన, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ద్వారకాతిరుమలలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దిశానిర్దేశం
- చింతలపూడిలో సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన ఎమ్మెల్యే ఎలీజా



ద్వారకాతిరుమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చింతలపూడిలో సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన ఎమ్మెల్యే ఎలీజా

ద్వారకాతిరుమల : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమష్టిగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాల లబ్ధిని, వైఎస్సార్ సీపీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వారు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 2024లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే తలారి దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా చేకూరుతున్న లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సంక్షేమ ఫలాలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, అందుకే వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గృహ సారథుల వల్ల వలంటీర్ల విధులకు ఎటువంటి ఆటంకం ఉండదని, వలంటీర్లకు ఇచ్చే గౌరవం, ప్రాధాన్యత ఏమాత్రం తగ్గదని, ప్రతిపక్షాలు సృష్టించే అపోహలను నమ్మొద్దని సూచించారు. వలంటీర్లకు తోడు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయికి అందేలా చూడాల్సిన బాధ్యత గృహ సారథులపైనే ఉందని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు, న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తోందని, గత పాలకుల్లాగా దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం లేదనే విషయాలను ప్రజలకు తెలియ చెప్పడంలో సచివాలయ కన్వీనర్లు కీలకమవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల సచివాలయ కన్వీనర్ డీజే రాజు, బొండాడ వెంకన్నబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, అంబటి గాంధీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, దూలపల్లి ప్రసాద్, పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని బుల్లియ్య, భోగరాజు చిన్ని, గోపా నాగేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్, ముల్లంగి వెంకట్రామిరెడ్డి, మానుకొండ సుబ్బారావు, పోలిన నారాయణరావు, జానీ, లక్కాబత్తుల ఇమ్మానియేలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

చింతలపూడి : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సచివాలయ కన్వీనర్లు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆదేశించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల సచివాలయ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. నవరత్నాల అమలుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరపాలన్నారు. సమస్యల పరిష్కారానికి వలంటీర్లతో కలిసి పని చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేలా ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు.

శాంతి భద్రతలపై సమీక్ష

నియోజకవర్గంలో శాంతిభద్రతలపై ఎమ్మెల్యే ఎలీజా పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ముఖ్యంగా అక్రమ మద్యం, నాటు సారాలను అరికట్టడంలో పోలీస్, ఎస్‌ఈబీ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని ఆదేశించారు. సారా రహిత నియోజకవర్గంగా చింతలపూడిని తీర్చిదిద్దాలన్నారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎస్‌ఈబీ సీఐ సాయి స్వరూప్, నాలుగు మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ



అల్లంచర్ల రాజుపాలెంలోని సచివాలయంలో విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ

టి.నరసాపురం : అల్లంచర్ల రాజుపాలెంలో మహిళా పోలీసు ఇచ్చిన ఫిర్యాదుపై పోలవరం డీఎస్పీ ఎ.లతాకుమారి సోమవారం అల్లంచర్ల సచివాలయానికి వెళ్లి విచారణ నిర్వహించారు. మహిళా పోలీసు బత్తుల గంగారత్నంను అదే గ్రామానికి చెందిన వ్యక్తి గుండ్ర నాగరాజు విధులను అడ్డగించి కులం పేరుతో దూషించినట్లు ఆమె ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సోమవారం విచారణ నిర్వహించి, డీఎస్పీ వివరాలు నమోదు చేసుకున్నారు.

స్పందనలో 22 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో మొత్తం 22 వినతులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో ఎక్కువ భూ సంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులు సంబంధిత రెవెన్యూ అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కామవరపుకోట : చెట్టు కొమ్మకు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన జీలకర్రగూడెం శివారు గొల్లగూడెం సమీపంలో జరిగింది. మృతుడు ఏలూరుకు చెందిన మధ్యాహ్నం గోపీకృష్ణగా భావిస్తున్నారు. జీలకర్రగూడెం శివారు గొల్లగూడెం సమీపంలోని గట్టు దగ్గర సాయిబాబా వాటర్ ట్యాంక్ పక్కన చెట్టు కొమ్మకు ఉరి వేసుకున్నాడు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో పశువుల కాపరులు గమనించి తడికలపూడి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చండీహోమం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం : స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యర్రమిల్లి మనోజ్ శర్మ పూజలు చేశారు. అనంతరం పలువురు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా వేదోక్తంగా చండీహోమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. పాలపొంగళ్లు అమ్మవారికి సమర్పించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

చింతలపూడి : ప్రజలు గడపగడపకు కార్యక్రమానికి అందిస్తున్న సహకారం మర్చిపోలేనని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లిలో సర్పంచ్ తుల్లిమిల్లి రాణి ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మ ఒడి, చేయూత, వైఎస్సార్ రైతు భరోసా, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వివిధ వర్గాల ప్రజలను ఎమ్మెల్యే ఎలీజా అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగానే అందుతున్నాయని, గ్రామంలో రహదారులు బాగాలేవని గ్రామస్తులు ఎమ్మెల్యే ఎలీజా దృష్టికి తీసుకువచ్చారు. రహదారులను కూడా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఒక మహిళ భర్త చనిపోయి ఏడాది అయినా పింఛన్ మంజూరు చేయలేదని చెప్పడంతో సచివాలయ సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, సర్పంచ్ తుల్లిమిల్లి రాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సాదరబోయిన వరలక్ష్మి, పార్టీ నేతలు తుల్లిమెల్లి చిన్న కుటుంబరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయ కన్వీనర్ ఎస్ దుర్గారావు, చింతలపూడి పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ఎం ఇమ్మానియేలు, ఎస్ కాంతారావు, ఎం దిలీప్, వెంపా కష్ణ, సీహెచ్ జ్ఞానారెడ్డి పాల్గొన్నారు.



యర్రగుంటపల్లిలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

వైభవంగా వీరభద్ర స్వామి రథోత్సవం



కామవరపుకోటలో వీరభద్రస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట : వీరభద్రస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం చౌతన సెంటర్లో స్వామివారి త్రిశూల స్నానం, వసంతోత్సవం అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని ముందుకు లాగారు. కామవరపుకోట పురవీధులలో అర్చకుల మంత్రాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, డీజే శబ్దాల నడుమ రథోత్సవం నిర్వహించారు. జీలకర్రగూడెం బౌద్ధరామ బృందం ప్రదర్శించిన కోలాటం, గుంటూరు వారిచే కర్ణాటక మహిళా వీర గాథ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది, విజయవాడ వారిచే బేతాళ విచిత్ర వేషాలతో చౌతన సెంటర్ నుంచి దుర్గ మహల్ మీదుగా గుర్రాల చెరువు వరకు తడికలపూడి ఎస్సై కె.వెంకన్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ రథోత్సవం సాగింది.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ లతాకుమారి

బుట్టాయగూడెం : విద్యార్థులకు డిగ్రీ వారి జీవితాన్ని తీర్చిదిద్దే మైలురాయని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి వారి జీవిత గమ్యాన్ని చేరుకోవాలని పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను డీఎస్పీ ఉచితంగా పంపిణీ చేశారు. ఎస్సై ఎం.జయబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని విద్యార్థులు విద్యాభివృద్ధిలో ముందుకు సాగాలని కోరుతూ డీఎస్పీ లతాకుమారి సుమారు రూ.40 వేలు తన సొంత ఖర్చులతో 130 పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను పేద విద్యార్థులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ మునీంద్రరావు మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకదానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.అక్కులన్న, కామర్స్ లెక్చరర్ ఎం.భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కానిస్టేబుల్ పరీక్షల్లో ఎంపికైన కళాశాల విద్యార్థిని మంజులను అభినందించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు డీఎస్పీ లతాకుమారిని ఈ సందర్భంగా అభినందించారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో చింతలపూడి విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనపరిచిన చింతలపూడి విద్యార్థులు

చింతలపూడి : ఈ నెల 3, 4, 5 తేదీల్లో విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో 6వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో చింతలపూడికి చెందిన కరాటే విద్యార్థులు రెండు స్వర్ణ పతకాలు, 4 వెండి పతకాలు, 4 రజత పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఈశ్వర్, కోచ్ సుమన్‌రాజు సోమవారం తెలిపారు. 14 ఏళ్ల బ్లాక్‌బెల్ట్ కటా విభాగంలో ఎన్ శ్రీలాశ్య స్వర్ణ పతకం, 40 కేజీల కుమిటే విభాగంలో వెండి పతకం, 13 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ కటా విభాగంలో ఎం.గౌతమ్ స్వర్ణ పతకం, 14 ఏళ్ల బ్లాక్‌బెల్ట్ కటా విభాగంలో వై నరశింహమూర్తి రజత పతకం, 50 కేజీల కుమిటే విభాగంలో వెండి పతకం, 13 ఏళ్ల గ్రీన్ బెల్ట్ కటా విభాగంలో బి విన్నీ రోహిత్ రజత పతకం, 50 కేజీల కుమిటే విభాగంలో రజత పతకం, 45 కేజీల కుమిటే విభాగంలో పి హాసిని రజత పతకం, 18 ఏళ్ల బ్లాక్ బెల్ట్ కటా విభాగంలో పి సుమన్ రాజు వెండి పతకం, 67 కేజీల కుమిటే విభాగంలో వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ధర్నా




ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సభ్యులు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం తాడువాయి గ్రామస్తులు, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ధర్నా నిర్వహించారు. బొడ్డపాటి శ్రీను మాదిగ అధ్యక్షతన జరిగిన ధర్నాలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోకన్వీనర్ విసంపల్లి సిద్ధు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్వేనెంబర్ 338లో 5 ఎకరాల 8 సెంట్ల శ్మశానభూమి అన్యాక్రాంతానికి గురైందన్నారు. ఈ భూమి కబ్జా చేసిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, రెవెన్యూ రికార్డులను తారుమారు చేసిన వీఆర్‌వో, తహసీల్దార్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఝాన్సీరాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ వాసు చౌదరి, ఎంఎస్‌పీ పట్టణ అధ్యక్షులు బొడ్డపాటి పండు మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పంటలకు నష్టం

కొయ్యలగూడెం : మంగపతిదేవిపేట గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదం వలన సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలోని పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక రైతుకు చెందిన పొలంలో విద్యుత్ వైర్లు తెగిపడడంతో మొదటిగా జీడి మామిడి తోటలో అగ్నిప్రమాదం సంభవించింది. అనంతరం జామాయిల్ తోటలకు వ్యాపించినట్లు ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదం వల్ల జలగం శామ్యూల్, జవ్వా వెంకన్న, అబ్బు పద్దయ్య, అబ్బు సుబ్రహ్మణ్యంలకు చెందిన పంటలకు నష్టం వాటిల్లిందని వీఆర్‌వో మక్బుల్ తెలిపారు. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ చేసి నివేదికను తహసీల్దార్‌కి అందజేస్తామని వీఆర్‌ఓ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు టి.రాణీరత్నప్రభ, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని, సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, న్యాయవాది యు.ఏసుబాబు మాట్లాడారు. అనంతరం ఆర్డీవో ఝాన్సీరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శిరోమణి, మడకం కన్నమ్మ, కె.మారమ్మ, కొనుతుల రామలక్ష్మి, కె.విజయదుర్గ, కొమరం ఆకాష్, మడకం కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఐటీడీఏ వద్ద ధర్నా

బుట్టాయగూడెం : 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఐటీడీఏలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు ఏ. రవి మాట్లాడుతూ 1/70 చట్టంపై సుప్రీంకోర్టులో విచారణ దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిరిజనుల పక్షాన వాదనలు వినిపించాలని అన్నారు. ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మల్బరీ సాగు విస్తరణకు ప్రత్యేక కృషి

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో మల్బరీ తోటల సాగును పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని పట్టు పరిశ్రమ అధికారి పైదా సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద మల్బరీసాగు విస్తరణపై వెలుగు అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మల్బరీసాగుపై డ్వాక్రా సంఘాలను కూడా అనుసంధానం చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు.

ఎమ్మెల్యే బాలరాజు కోలుకోవాలని హోమం



సీతంపేట బైనేరు సమీపంలో శివాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : పోలవరం ఎమ్మెల్యే, శాసనసభా పక్ష ఎస్టీ కమిటీ చైర్మన్ తెల్లం బాలరాజు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మమేకం కావాలంటూ మృత్యుంజయ హోమం నిర్వహించారు. బయ్యనగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు తోట జయ బాబు సీతంపేట సమీపంలోని బైనేరు వాగు వద్ద కొలువైన శివాలయంలో ఈ హోమం నిర్వహించారు. పురోహితులు వజ్జుల బుజ్జి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే బాలరాజు గుండె సంబంధిత అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ మెరుగైన చికిత్స కోసం వెళ్లిన ఆయన ఇటీవల స్వగ్రామం దుద్దుకూరు తిరిగివచ్చారు. సీతంపేట, నరసన్నపాలెం సర్పంచ్‌లు తోటకూర పద్మావతి, కర్రెడ్ల ప్రభావతి, ఎంపీటీసీ మిర్యాల విజయ, మధ్యాహ్నపు ఏసు, కొప్పుల వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీను, నర్సు కుమార్ రాజు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లి శివారులో ఆటో బోల్తా

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లి శివారులో సోమవారం ఉదయం ఒక పాసింజర్ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు తీవ్ర గాయాలు పాలయ్యారు. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.